

తెలంగాణ పునర్నిర్మాణానికి కృషి చేయాలి

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.హరగోపాల్

ఏజీవర్సిటీ: తెలంగాణ పునర్నిర్మాణానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంతి అధ్యాపకులు ప్రొ.హరగోపాల్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సంఘం ,బోధన, బోధనేతర సిబ్బంది ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో శనివారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.తెలంగాణలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందని అన్నారు.కొత్త ప్రభుత్వం వచ్చాక ఇప్పుడే తెలంగాణ వచ్చినట్లునిపిస్తుందని వ్యాఖ్యానించారు. పౌర సమాజం,విశ్వవిద్యాలయాలు చైతన్యవంతంగా ఉండాలన్నారు. ప్రభుత్వాలు నిరంతరము ప్రజలతో చర్చలు సాగిస్తుండాలని వ్యవసాయ అభివృద్ధికి ఒక కమిషన్,హైదరాబాద్ చుట్టూ ఉన్న భూముల పరిరక్షణకు ఒక కమిషన్‌ను వేయవల్సిందిగా మాజీ సీఎం కేసీఆర్‌కి సూచించినా పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రైతుల్లో అధిక శాతం సన్న ,చిన్న కారు రైతులే ఉన్నారని వారి అభ్యున్నతిలో వ్యవసాయ విశ్వవిద్యాలయంది కీలకపాత్రని ఆయన అభిప్రాయపడ్డారు.మన రాష్ట్రం,దేశము వ్యవసాయం ప్రధానమైనదని గుర్తించాలన్నారు.తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ విత్తన భాండాగారం అనే పేరు ఉన్నప్పటికి సన్నా,చిన్న కారు రైతులకి మేలు చేసే విధంగా గత ప్రభుత్వం ఏ చర్యలు చేపట్టలేదన్నారు.ప్రసుత ప్రభుత్వం చర్చలు,సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షదాయకమన్నారు. ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సూచించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి మాట్లాడారు. అనంతరం ఉద్యమ కాలంలో చురుకుగా పనిచేసిన అధ్యాపకుల్ని,పాత్రికేయుల్ని ముఖ్య అతిధుల్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమలో(టాసా) అధ్యక్షులు విద్యాసాగర్ సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్,డాక్టర్ వనమాల, ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె జి వి వెన్నెల తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హరగోపాల్

కూలిన భవన నిర్మాణ స్లాబ్



మణికొండ: నిర్మాణంలో ఉన్న మాల్ బాల్కానీ స్లాబ్ ఒక్క సారిగా కూలిపోయింది. అది కాస్త విద్యుత్ వైర్లపై పడటంతో అవి తెగిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. పూర్తి వివరాల్లోకి వెలితే మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 14లో ఆర్‌ఆర్ మాల్ నిర్మాణం కొనసాగుతుంది. మూడవ అంతస్తు స్లాబ్ శనివారం వేస్తున్న క్రమంలో బాల్కానికి భూమిపై నుంచి పెట్టిన సపోర్టు అదుపు తప్పటంతో ఒక్కసారిగా బాల్కానీ స్లాబ్ కూలిపోయింది. ప్రాణాపాయం తప్పటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా కూలిన స్లా బ్‌ను చిత్రీకరిస్తున్న మీడియాపై నిర్మాణ సంస్థ ప్రతినిధులు దాడికి యత్నించారు. దాంతో మీడియా ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి


విజయలక్ష్మి గణపతి ఆలయంలో సామూహిక హోమాలు


పూజలో పాల్గొన్న పెండ్యాల సాయి మల్లిక్

రాజేంద్రనగర్: హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ భక్త వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సాయికిరణ్ గౌడ్, సన్నీ చినోల, సుజీత్, హరికిరణ్ గౌడ్, చారి, నీరంజన్, శివ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మణికొండలో..

మణికొండ: హనుమాన్ జయంతిని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీల పరిధిలోని హనుమాన్ ఆలయాలలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. మణికొండ శ్రీ లలితా సమాఖ్య ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పలు దేవాలయాలలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

హోమాలు..

బండ్లగూడ: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ శ్రీ విజయలక్ష్మి గణపతి దేవాలయంలో 108 మంది దంపతులు హోమాలు చేశారు. మేయర్ లతాప్రేమ్‌గౌడ్ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.





భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలి

జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి


సదస్సులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మణికొండ: నీటిని మనమంతా పొదుపుగా వాడుకోవటంతో పాటు వీలైనంత వరకు భూగర్భజలాలను పెంచినపుడే భవిష్యత్తు తరాలు సౌకర్యంగా జీవించే అవకాశం ఉంటుందని, దానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జలమండలి మణికొండ డివిజన్ జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం అలకాపూర్ టౌన్‌షిప్ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భజలాలు పెంపు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇల్లు, అపార్ట్‌మెంట్‌కు బోర్లు వేసి ప్రతి రోజు లక్షల లీటర్ల నీటిని భూమిలో నుంచి లాగుతున్నామన్నారు. అదే స్థాయిలో తిరిగి భూమిలోకి నీటిని పంపినపుడే తిరిగి మనకు నీటి లభ్యత ఉంటుందన్నారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్‌లు, రోడ్ల పక్కన ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి వీలైనంత ఎక్కువగా నీటిని భూమిలోకి పంపాలన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో వీలైనన్ని ఎక్కువ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు సంక్షేమ సంఘం ముందుకు రావటం హర్షనీయమని, వారికి అవసరమైన అవగాహన కల్పించి, విజయవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం శ్రీమన్నారాయణ, మేనేజర్ స్ఫూర్తిరెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌జీఓ ప్రతినిధులు సత్యనారాయణ, నందీశ్వర్, పలు అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌లు, టౌన్‌షిప్ ప్రజలు పాల్గొన్నారు.

పాలక కమిటీకి సన్మానం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఎన్నో ఉన్నాయని వాటిని పూర్తి చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, కౌన్సిలర్‌లు, వారి ఎన్నికకు సహకరించిన రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి చైర్మెన్ బి.జ్ఞానేశ్వర్‌లను శనివారం కోకాపేట రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత పాలక కమిటీ కోకాపేటను చిన్నచూపు చూసిందని, దీంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మైలారం శ్రీనివాస్, కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, జి. అమరేందర్‌రెడ్డి, దుర్గేష్‌యాదవ్, నాయకులు గోపాల గణేష్, యాదగిరి, రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.


పూడికతీత పనుల పరిశీలన

బండ్లగూడ: ఎర్రకుంటలో పూడిక తీసి కుంట సుందరీకరణ చేపడుతున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమిషనర్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హైదర్షాకోట్‌లోని ఎర్రకుంట పూడికతీత పనులను ఆయన కార్పొరేటర్ చంద్రశేఖర్, టింకురెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఏఈ రాజు, నాయకులు సందీప్‌ముదిరాజ్, అధికారులు పాల్గొన్నారు.





ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేస్తా


భవానీ కాలనీ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేస్తామని కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. శనివారం 8వ డివిజన్ భవానీ కాలనీ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. అలాగే నూతనంగా ఎన్నికైన మేయర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తేస్తే వాటిని పరిష్కరించేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తానన్నారు . కార్పొరేటర్ భూపాల్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

